సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 7 । జనవరి । 2023



విద్యుత్ ప్రమాదాలకు చెక్

జిల్లాలో పోల్ టు పోల్ సర్వే కొనసాగుతోంది. మరో పదేళ్ల పాటు ఉండేలా మరమ్మతులు జరుగుతున్నాయి.

- 8లో



భవన నిర్మాణం అడ్డగింత

అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అడ్డుకున్నారు. ఇది చర్చనీయాంశమవుతోంది.

- 8లో

10న జెడ్పీ బడ్జెట్ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 10న ఉదయం 11.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లుగా జెడ్పీ సీఈఓ ఆర్. వెంకట్రామన్ తెలియజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని, అలాగే ఈ సమావేశానికి కంటే ముందు ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ 1వ స్థాయీ సంఘ సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నామని, ఈ సమావేశాలకు జెడ్పీ సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

ఉద్దానంలో ఎలుగు సంచారం



బైపల్లి పరిసర తోటల్లో సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం తీర ప్రాంతాల్లో ఎలుగులు సంచరిస్తూ ప్రజలకు భయాందోళనకు గురి చేస్తున్నాయి. శారదపురంలో గురువారం దూడపై గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. శుక్రవారం బైపల్లి,బాతుపురం పరిసర తోటల్లో ఎలుగు సంచారంతో మళ్లీ ఉద్దానంకు ఎలుగు గుబులు పట్టుకుంది. ప్రస్తుతం జీడి, మామిడి పంట పూత దశలో ఉండ టంతో ఎరువులు, పురుగు మందులు పిచికారి చేసేందుకు, కంచెలను ఏర్పాటు చేసేందుకు రైతులు తోటలకు వెళ్తున్నారు. ఈ తరుణంలో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వారు భయపడుతున్నారు.

హరిపురం సీహెచ్‌సీని తనిఖీ చేసిన మంత్రి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం రాత్రి పది గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులను కలిసి వైద్యులు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వర్మ విధుల్లో ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట హరిపురం సర్పంచ్ పురుషోత్తం, ఎంపీటీసీ అప్పన్న, పితాతొళి సర్పంచ్ చింతాడ గణపతి, బాలిగాం సర్పంచ్ తలగాన చంద్రశేఖర్, హరిపురం మాజీ ఎంపీటీసీ రాము తదితరులు ఉన్నారు.

ఆ ఫొటోతో మృతదేహం గుర్తింపు



యువకుడిని అభినందించి, రివార్డు అందిస్తున్న ఎస్‌ఐ కృష్ణప్రసాదు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస సమీపంలోని ముంగెన్న చెరువులో ఓ వ్యక్తి మృతదేహం ఇటీవల పోలీసులకు లభ్యమైంది. కానీ అతని వివరాలు ఎవరికీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఈ మృతదేహం ఎవరికి అప్పగించాలో, ఎవరికి చెప్పాలో పాలుపోలేదు. రోజుల తరబడి దర్యాప్తు చేసేంత సమయం కూడా లేదు. ఇలాంటి సమయంలో ఒక ఫొటో పోలీసుల పనిని ఈజీ చేసేసింది. కటకటమయ్యపేట గ్రామానికి చెందిన యువకుడు ప్రదీప్‌కుమార్ సరదాగా తీసిన ఒక ఫొటో మృతుడి వివరాలను తెలుసుకునేందుకు ఉపయోగపడింది. చనిపోయిన వ్యక్తి గోవాకు చెందిన వాడు. మతిస్థిమితం కోల్పోయి ఊరూరా తిరుగుతూ కటకటమయ్యపేట గ్రామానికి వచ్చాడు. అప్పట్లో అతనికి ఆ గ్రామస్తులు దుస్తులు అందించారు. అప్పుడు ప్రదీప్ ఓ ఫొటో తీశాడు. ఆ ఫొటో ఇప్పుడు పోలీసుల కంటపడడంతో మృతుడి అడ్రస్ సేకరించడం సులువైంది. దీంతో వెంటనే మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు స్వయంగా గ్రామానికి వెళ్లి యువకుడు ప్రదీప్‌ను అభినందించి, రివార్డు అందించారు. గ్రామాలకు ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిన వెంటనే ఫొటోలు తీసి భద్రపరచాలని గ్రామస్తులకు తెలిపారు.

'అసిస్టెంట్ కమిషనర్ వేధింపులకు పాల్పడుతున్నారు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: వాణిజ్య పన్నుల శాఖలో తనపై అసిస్టెంట్ కమిషనర్ మరికొంత మంది సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారని వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ అధ్యక్షురాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యదర్శి అలికాన రాజేశ్వరి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. ఏఈవోగా చేరిన నాటి నుంచి రెండు నెలల పాటు విధులు కేటాయించలేదని తెలిపారు. తనపై ఉన్నతాధికారులు కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డిసెంబర్ 2022 జీతాన్ని నిలిపివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రశ్నించినా లాభం లేదన్నారు. వీటిపై విచారణ జరిపించి జీతం ఇప్పించాలని కోరారు.

అర్హులకు పెన్షన్..
విపక్షాలకు టెన్షన్

తుస్సుమన్న దుష్ప్రచారం

- నిలిపివేసిన పింఛన్ల పునరుద్ధరణ
- ఆడిట్‌లో అభ్యంతరం వచ్చిన పింఛన్లు 5994
- రీ వెరిఫికేషన్ తర్వాత పునరుద్ధరించినవి 4127
- తలదించుకున్న ప్రతిపక్షాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'మనది మానవత్వం ఉన్న ప్రభుత్వం. పేదవాడికి దగ్గరగా ఉండే మనసులు మనవి. అర్హత ఉండి కూడా ఈ ప్రభుత్వంలో మంచి జరగలేదనే మాట ఏ ఒక్క పేదవాడి నుంచి రాకూడదు. పథకాలు అర్హులందరికీ అందాలి. అనర్హులకు అందకూడదన్నదే మన విధానం. దాని కోసం ఆర్నెల్లకు ఒకసారి ఆడిట్ నిర్వహిస్తున్నాం. అనుమానాలు, సందేహాలున్న వారికి నోటీసులిస్తున్నాం. రీ వెరిఫై చేశాక అర్హులైతే పథకాలిచ్చేద్దాం.'

– పింఛన్ల ఆడిట్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలివి.

సీఎం వైఎస్ జగన్ ఒకసారి మాటిస్తే.. కచ్చితంగా చేసి తీరుతారని జనం నమ్ముతున్నారు. ఆ విశ్వాసాన్ని బలపరుస్తూ పింఛన్ల విషయంలో సీఎం మానవత్వం చూపారు. అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు పునరుద్ధరించారు. జిల్లా వ్యాప్తంగా 5,994 పింఛన్లపై అభ్యంతరాలు రాగా, 4127మంది అర్హులేనని రీ వెరిఫికేషన్‌లో తేల్చారు. కేవలం 1705 మందిని మాత్రమే అనర్హులుగా ధ్రువీకరించారు. మరో 162 పరిశీలన దశలో ఉన్నాయి. అభ్యంతరాలున్న వాటిలో అర్హులైన వాటికి పింఛన్ల సొమ్ము కూడా చాలావరకు ఇప్పటికే ఇచ్చేశారు. అనర్హులుగా మిగిలిపోయిన వాటిలో అత్యధికం ధనవంతులతో పాటు భర్తలుండి భర్తలేనట్టుగా చూపించి వితంతు పింఛన్లు పొందుతున్న వారు ఉన్నారు. అలాగే భర్తలున్నా తమను విడిచి పెట్టేశారని చెప్పి ఒంటరి మహిళ పింఛన్లు పొందుతున్న వారున్నారు. వీరి పింఛన్లు నిలిపివేయడం ఏ ప్రభుత్వానికైనా తప్పనిసరి. దీంతో టీడీపీ, జనసేన చేసిన దుష్ప్రచార రాజకీయాలు బెడిసికొట్టాయి.



నా పేరు లింగం అప్పల నర్సమ్మ. మాది ఉర్లాం. చాలా కాలం నుంచి వితంతు పింఛన్ వస్తోంది. జగన్ బాబు పింఛన్ డబ్బులు పెంచారు. ఈ ఆనందంలో ఉంటుండగా కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తుందని చెప్పి నోటీసులు వచ్చాయి. చాలా బాధ కలిగింది. పింఛను మరి రాదు అనుకున్నా.. అయితే సచివాలయ సిబ్బంది, సర్పంచ్ నర్సింహమూర్తి సూచనలతో విద్యుత్ బిల్లు తీసుకొని పైకి పంపారు. తర్వాత పింఛన్ మంజూరు అయిందని చెప్పారు. డబ్బులు కూడా ఇచ్చేశారు. చాలా ఆనందంగా ఉంది. మా గ్రామంలో 9 మందికి నోటీసులు వస్తే అందరికీ మళ్లీ పింఛను వచ్చింది.

నాటి తప్పులతో..

- అర్హులందరికీ లబ్ధి చేకూరాలని, మిగిలిపోయిన అర్హులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఆడిట్ నిర్వహిస్తోంది.
- ఈ క్రమంలో జిల్లాలో కొత్తగా 9,346 మందికి పింఛన్లు మంజూరవ్వగా, పాతవారిలో 5,994 మందికి సంబంధించి అభ్యంతరాలు వెలుగు చూశాయి.
- వీరిలో చాలామంది అర్హులైనప్పటికీ 2016లో గత ప్రభుత్వం నిర్వహించిన సామాజిక సాధికారత సర్వేలో తప్పుగా నమోదైన వివరాలే ప్రధాన కారణం.
- ఆధార్ కార్డు, రేషన్‌కార్డు లింక్ చేసేసరికి ఇలాంటివన్నీ బయటికొచ్చాయి.
- దీంతో ఆడిట్‌లో అభ్యంతరాలున్న వాటిపై రీ వెరిఫికేషన్‌కు ఆదేశించారు.
- దీనిపై టీడీపీ, జనసేన రాజకీయ పక్షాలు పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశాయి. పింఛన్లు తీసేస్తున్నారని, వృద్ధులు, వితంతువులకు అన్యాయం చేసేస్తున్నారని తెగ రాద్ధాంతం చేశాయి. రాజకీయంగా వాడుకోవాలని చూశాయి. కానీ వారి కుతంత్రాలు, కుయుక్తులు సాగలేదు.
- వాస్తవాలు తెలుసుకున్న లబ్ధిదారులు సైతం ప్రతిపక్షాలు చేసిన కుట్ర ప్రచారాన్ని తిప్పికొడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అప్పటికీ.. ఇప్పటికీ ఇదే తేడా..

చంద్రబాబు హయాంలో జిల్లాలో 74,194 పింఛన్లను అన్యాయంగా తొలగించేశారు. ఎంత మొత్తుకున్నా పట్టించుకోలేదు. అభ్యంతరాలు వ్యక్తం చేసినా... సందేహాలు నివృత్తి చేసినా.. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించలేదు. చివరికీ తొలగింపునకు గురైన వారిలో కొంతమంది కోర్టుకెళ్లి న్యాయం పొందారు. చంద్రబాబు హయామంతా జన్మభూమి కమిటీల దోపిడీ, దౌర్జన్యం, నియంతృత్వ పోకడే కొనసాగింది. జన్మభూమి కమిటీ సభ్యులు కనుసన్నల్లో పింఛన్లు ఇచ్చిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎక్కడైనా సాంకేతికంగా పింఛన్ ఆగితే వెంటనే పరిశీలన చేసి పునరుద్ధరిస్తున్నారు.

పింఛన్ పునరుద్ధరణ



ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామ పంచాయతీ నవభారత్ నగర్‌కు చెందిన పైడి అరుణ వితంతు పింఛన్ అందుకుంటున్నారు. గృహ విద్యుత్ 300 కంటే ఎక్కువగా యూనిట్లు వినియోగించినట్లు నమోదు కావటంతో నోటీసు ఇచ్చారు. పొరపాటున ఆమె ఆధార్ కార్డుకు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇంటితో లింక్ అయ్యింది. దీంతో ఎలక్ట్రికల్ ఏఈని కలిశారు. తనకు ఒకే మీటర్ ఉందని , ప్రతి నెలా మూడు వందల కంటే తక్కువ యూనిట్లు వినియోగిస్తున్నట్లు లెటర్ తీసుకున్నారు. ఈ లెటర్‌ను సంక్షేమ కార్యదర్శి గోవింద్‌కు అందజేశారు. దీంతో పింఛన్ నిలుపుదల చేయకుండా అందజేశారు.

నోటీసు మాత్రమే వచ్చింది..



టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకు చెందిన రాజాపు వెంకటమ్మకు వితంతు పింఛన్ వస్తోంది. అయితే ఈమె ఆధార్‌కు 9 విద్యుత్ మీటర్లు అనుసంధానం జరిగినట్లు ఉండటంతో గత నెల నోటీసులు అందజేశారు. దీంతో ఆమె వలంటీర్ ప్రవీణతో కలిసి గ్రామ సచివాయం-1 వెల్ఫేర్ సహాయకుడు మోహన్, డిజిటల్ అసిస్టెంట్ జీవన్‌ను సంప్రదించారు. ఇదే విషయాన్ని తెలుసుకుని ఏపీ ఈడబ్ల్యుఐడీసీ డైరెక్టర్ ఉర్జాన విశ్వనాథం విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కేవలం రెండు రోజుల్లోనే ఈమె సమస్య పరిష్కారమైంది. దీంతో పెంచిన దానితో కలిపి ఈ జనవరిలో రూ.2750ల వితంతు పింఛన్ అందుకుంది.

నోటీసు ఇచ్చారు.. అయినా పింఛన్ అందింది



మెళియాపుట్టి మండలం, మారడికోట గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలి పేరు కొల్లి సత్యమమ్మ. ఈమెకు నాలుగు వేల ఎకరాలు భూమి ఉందని చూపించటంతో అధికారులు నోటీసు ఇచ్చారు. సత్యమమ్మ కొడుకు అధికారులను కలిశాడు. వాస్తవానికి తమకంత భూమి లేదని పత్రాల ద్వారా ఆధారాలు చూపించడంతో సత్యమమ్మకు జనవరి నెల వృద్ధాప్య పింఛన్ డబ్బులు ఇంటికి తీసుకుని వెళ్లి అందజేశారు.

ఏమ్మా.. పింఛన్ వస్తోందా..!



మజ్జి జమునతో అరుగుపై కూర్చొని మాట్లాడుతున్న శామ్యూల్ ఆనందకుమార్

ఇచ్ఛాపురం రూరల్: 'ఏమ్మా పింఛన్ వస్తుందా.. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా...?!' అంటూ ఏకసభ్య కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్ పూరి గుడిసెల్లో ఉన్న బెంతు ఒరియా మహిళలను పరామర్శించారు. బెంతు ఒరియా కులానికి సంబంధించి వారి వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి వచ్చిన ఆయన శుక్రవారం మండలం తిప్పనపుట్టుగలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మట్టి అరుగుపై కొబ్బరి పీచుతో తాడును తయారీ చేస్తున్న మహిళల పక్కనే నేలపై కూర్చొని వారితో మాట్లాడి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బెంతు ఒరియా సంఘ నాయకులు రజనీకుమార్ దొళాయి, ఉపాధ్యాయుడు శివ బిసాయి, దేవరాజ్ సాహూలు మాట్లాడుతూ గతంలో 1973 నుంచి 76 వరకు, 1981నుంచి 88 వరకు, 1999 నుంచి 2003 వరకు తమకు ప్రభుత్వాలు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశాయని, రెండున్నర దశాబ్దాల నుంచి ధ్రువీకరణ పత్రాలకు నోచుకోకపోవడంతో తమ కులం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయిందని ఆయన దృష్టికి తెచ్చారు. స్థానిక రచ్చబండ వద్ద నిర్వహించిన సమావేశంలో కమిషన్ సభ్యుడు శామ్యూల్ ఆనందకుమార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో పర్యటించి నేరుగా వారి స్థితి గతులను పరిశీలించిన నేపథ్యంలో పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఐటీడీఏ పీఓ నవ్య, పలాసా ఆర్డీఓ తమరాల సీతారామ్మూర్తి, తహసీల్దార్ ఎం.లావణ్య, సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఎంపీటీసీ నర్తు ప్రేమ్‌కుమార్, ఒడియా సంఘ నేతలు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన కనిమెట్ట వీఆర్‌ఓ

- మ్యుటేషన్ కోసం రూ. 3 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం



పట్టుబడిన వీఆర్‌వో గోవిందరావు

పొందూరు: మండలంలోని కనిమెట్ట వీఆర్‌ఓ ఎం.గోవిందరావు రూ.3వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. శ్రీకాకుళం అవినీతి నిరోధక శాఖ అధికారి బీవీఎస్ఎస్ రమణమూర్తి అందించిన వివరాల మేరకు.. మండలంలోని కనిమెట్ట గ్రామం రెవెన్యూ అధికారిగా ముంజేటి గోవిందరావు పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బొడ్డేపల్లి భారతమ్మ మూడు నెలల కిందట భూమి మ్యుటేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆమె బంధువు నంద నాగరాజు మ్యుటేషన్ కోసం వీఆర్‌వోను పలుమార్లు సంప్రదించారు. అయితే మ్యుటేషన్ చేయాలంటే రూ. 3 వేలు లంచం ఇవ్వాలని వీఆర్‌వో డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో పని చేయలేదు. నాలుగు రోజుల కిందట నాగరాజు వీఆర్‌ఓను కలిస్తే.. మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో వారు ఈ నెల 4న ఆన్‌లైన్‌లో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు కూడా లంచం డిమాండ్ చేయడంతో నంద నాగరాజు అవినీతి నిరోధక శాఖను సంప్రదించారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి సూచనలతో నాగరాజు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే ఏసీబీ అధికారులు వల పన్ని ఉండడంతో నాగరాజు నుంచి వీఆర్‌ఓ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీఆర్‌వో నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని ఏసీబీ కోర్టుకు తరలించారు.

మూలపేటలో ఎకరాకు రూ.26 లక్షలు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట గ్రామ భూములకు ఎకరాకు రూ.26 లక్షలు ఇవ్వాలని నిర్ణయించినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం హార్బర్‌కు సంబంధించి భూ సేకరణపై ధర నిర్ణయించేందుకు మూలపేట రైతులతో సమావేశం నిర్వహించారు. ఆ గ్రామంలో 54 ఎకరాలు కావాల్సి ఉండగా 25 ఎకరాలకు సంబంధించిన రైతులతో చర్చించి ఆ మేరకు భూమిని తీసుకుంటున్నట్లు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. మరో 30 ఎకరాల భూమి కావాల్సి ఉందన్నారు. 32 మంది రైతులతో చర్చించి 25 ఎకరాల భూమికి ఎకరా రూ.26 లక్షలకు ధర నిర్ణయించినట్లు రైతులకు తెలిపారు. రోడ్డుకు దగ్గరగా ఉన్నందువల్ల ఈ ధర నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. సంతబొమ్మాళి సర్పంచ్ పి.రవి కుమార్ రెడ్డి రైతులతో చర్చించారు. మరో 30 ఎకరాలు కావాల్సి ఉంటుందని, ఆ భూమి సేకరించిన నెల రోజుల్లోనే నౌపడ వద్ద పునరావాస కాలనీలకు రోడ్లు, కాలువలకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి, సంతబొమ్మాళి మండలం తహసీల్దార్ చలమయ్య, సంతబొమ్మాళి సర్పంచ్ పి. రవి కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా రూ. 385 కోట్లతో సీసీ రోడ్లు



బోరుమజ్జిపాలెంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: జిల్లావ్యాప్తంగా రూ.385 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ ఎస్‌ఈ వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. శుక్రవారం ఏఐఐ బ్యాంకు అధికారుల బృందంతో కలిసి కోటబొమ్మాళి మండలంలోని బోరుమజ్జిపాలెంలో ఈఏపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 300 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందని, డిసెంబర్ నాటికి మిగిలిన గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఐ బ్యాంకు అధికారుల బృందం సభ్యులు పర్షాద్, అశోక్‌కుమార్, డాక్టర్ రాజు, శివ, బాబు, పంచాయతీ రాజ్ ఈఈ గిరిధర్, డీఈలు రమణమూర్తి, అప్పలసూరి పాల్గొన్నారు.

రానున్న ఉగాదికి 33,030 గృహ ప్రవేశాలు



టెక్కలిలో హౌసింగ్, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న హౌసింగ్ పీడీ గణపతిరావు

టెక్కలి: రానున్న ఉగాదికి జిల్లా వ్యాప్తంగా 33,030 గృహ ప్రవేశాలు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్.గణపతిరావు వెల్లడించారు. టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన హౌసింగ్, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 672 వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్‌లు వేసినట్లు పేర్కొన్నారు. ఇందులో మొత్తం 77,550 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. టెక్కలి డివిజన్ పరిధిలో 143 లేఅవుట్ ల ద్వారా 4063 ఇళ్లు మంజూరు చేశామన్నారు. వీటితో పాటు సొంత స్థలాలు ఉన్న వారు 5512 మంది ఉన్నారని పీడీ గణపతిరావు తెలిపారు. ప్రతి లేఅవుట్ లో పూర్తి స్థాయిలో ఇంటి నిర్మాణాలు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఇసుక, సిమెంట్, గజాలు సరఫరాలో ఎలాంటి జాప్యం లేదని ఆయన పేర్కొన్నారు. రానున్న ఉగాదికి కచ్చితంగా గృహ ప్రవేశాలు జరగాలని పీడీ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఈఈ పీ.వి.జోగారావు, డీఈ కె.సుజాత, ఏఈలు సంగమేశ్వరరావు, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8న గ్రూప్-1 పరీక్ష

- జిల్లాలో 19 కేంద్రాలు
- హాజరు కానున్న 5600 మంది అభ్యర్థులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైజన్ ఆఫీసర్లుగా సీనియర్ జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. మెటీరియల్ తీసుకువెళ్లే వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ పరీక్షలకు 5,600 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున మొత్తం 219 మందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మౌలిక వసతుల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పరీక్షకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా 08942 240557 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కంట్రోల్ రూమ్ ఆదివారం సాయంత్రం వరకు పనిచేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ లైజన్ అధికారులుగా జిల్లా అధికారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీపీఎస్సీ నుంచి సహాయ కార్యదర్శి బీఎస్ మూర్తి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం 9.45 గంటల వరకు, మధ్యాహ్నం 1.45 గంటల వరకు అనుమతించాలన్నారు.

'బీఆర్‌ఎస్‌కు అవగాహన లేదు'



హనుమంతు లజపతిరాయ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులపై అవగాహన లేకుండా అమరావతి రాజధానికి అనుకూలమంటూ బీఆర్‌ఎస్ ప్రకటించటం అవగాహన రాహిత్యమని రాష్ట్ర వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. ఎచ్చెర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మూడు రాజధానులు అవసరం లేదని చెప్పటం అవగాహన రాహిత్యమని పేర్కొన్నారు. ముందుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఆకాంక్షలను తెలుసుకోవాలని హితవుపలికారు.

8న షెడ్యూల్ కులాల చైర్మన్ రాక

శ్రీకాకుళం పాత బస్టాండ్: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కె.హర్షవర్ధన్ జిల్లాలో రెండు రోజులు పాటు పర్యటించనున్నట్టు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. 8, 9వ తేదీల్లో రెండు రోజుల పాటు సోంపేట, బారువ, కంచిలిలో పర్యటిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు రూ.7 లక్షల వితరణ



మహిళలతో కలిసి ఊరేగింపుగా బయలుదేరుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘం సభ్యులు ఏప్రిల్ 17న జరగనున్న స్వేచ్ఛావతి అమ్మవారి గ్రామదేవత ఉత్సవాలకు రూ.7లక్షలు వితరణ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా కార్యాలయం నుంచి మహిళాసంఘ సభ్యులంతా కలిగి ఊరేగింపుగా గ్రామదేవత ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.7,00,011ను చెక్‌రూపంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం జానకిరామారావు, సీఈఓలు బాలరాజు, సంతోష్, ఆర్పీలు, మహిళాసంఘ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో శ్రీకాంత్ ప్రతిభ



శ్రీకాంత్ మహంతిని అభినందిస్తున్న ధర్మాన కృష్ణదాస్

ఇచ్ఛాపురం: జాతీయ స్థాయి యోగా పోటీల్లో పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి ప్రతిభ కనబర్చాడు. ఇండియన్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి 28 మధ్య పాండిచ్చేరిలో నిర్వహించిన యోగా పోటీల్లో 20 నుంచి 30 సంవత్సరాల విభాగంలో శ్రీకాంత్‌మహంతి పాల్గొని 4వ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు శ్రీకాంత్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం అభినందించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



సీతమ్మ(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని ధవళపేటకు చెందిన 102 ఏళ్ల వృద్ధురాలు కంచరాన సీతమ్మ శుక్రవారం మృతిచెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. సీతమ్మ మృతి పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

పాతపట్నం సబ్‌జైల్ సందర్శన

పాతపట్నం: పాతపట్నం సబ్ జైలును జైళ్ల శాఖ కోస్తాంధ్ర రీజియన్ డీఐజీ ఎం.రవి కిరణ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. సబ్ జైలు కార్యాలయంలోని రికార్డులు, స్టోర్ రూమ్, వంటశాల, గ్రంథాలయం, ఖైదీల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒక సారి సబ్‌జైల్‌ను పరిశీలించాలని, అందులో భాగంగా వచ్చానన్నారు. పాతపట్నం సబ్ జైల్‌లో సూపరింటెండెంట్ లేరని విలేకరులు అడగ్గా, ప్రస్తుతం ఉద్యోగులు తక్కువగా ఉన్నారని, త్వరలో సూపరింటెండెంట్‌ను నియమిస్తామన్నారు. ముందుగా పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఆలయ సిబ్బంది డీఐజీకు పూర్ణ కుంభంతో ఆలయంలోకి ఆహ్వానించి, ఆలయ మర్యాదలతో ఆలయంలోకి తీసుకువెళ్లారు. ఆయనతో పాటు జిల్లా సబ్ జైల్ అధికారి కే.మోహనరావు, పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్‌ఐ ఎస్ కామేశ్వరరావు, సూపరింటెండెంట్ ప్రసాద్, కృష్ణారావు, సుదర్శన్, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలకు చెక్

- జిల్లాలో కొనసాగుతున్న పోల్ టు పోల్ సర్వే
- వెనువెంటనే పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బంది
- మరో దశాబ్దం వరకు లైన్లు దెబ్బతినకుండా చర్యలు



వాలిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

అరసవల్లి: అనంతపురంలో గత ఏడాది అక్టోబర్‌లో విద్యుత్ తీగలు తెగిపడి అక్కడికక్కడే ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. కాలపరిమితి దాటేసిన విద్యుత్ వైర్లు, కండక్టర్లు ఇతరత్రా సామగ్రియే ఈ దుర్ఘటనకు కారణమని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుని అన్ని జిల్లాల్లోనూ విద్యుత్ ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలనే లక్ష్యంగా పెట్టుకుంది. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోనూ అన్ని సర్కిళ్లల్లోనూ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి విద్యుత్ తీగలను, కండక్టర్లను ఇతరత్రా వ్యవస్థలను పటిష్టం చేయాలని, కాలం ముగిసిన విద్యుత్ సామగ్రిని తక్షణమే మార్చేయాలని ఈపీడీసీఎల్ అధికారులు నిర్ణయించారు. జిల్లాలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల నుంచి పోల్ టు పోల్ సర్వేను కొనసాగిస్తున్నారు. సర్వేలో గుర్తించిన వేలాది కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, వేలాది విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చేసి వ్యవస్థను పునరుద్ధరణ చర్యలకు విద్యుత్ అధికారుల బృందం నడుంబిగించారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో సర్వే ఆధారంగా పునరుద్ధరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

వాలిన స్తంభాలు	దెబ్బతిన్న స్తంభాలు	వేలాడుతున్న వైర్లు	స్పాన్లు	దెబ్బతిన్న కండక్టర్లు
33 కేవీ	317	118	578	24.39 కి.మీ.
11 కేవీ	4550	10514	8138	1862 కి.మీ.
ఎల్.టి	6109	22300	9713	2339 కి.మీ.

భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా..

జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్ల పరిధిలోని మొత్తం 33 కేవీ, 11 కేవీ విద్యుత్ ఫీడర్లతో పాటు ఎల్‌టీ విద్యుత్ లైన్ల పరిధిలో విద్యుత్ శాఖ సిబ్బంది సర్వే చేపట్టారు. మొత్తం 13 అంశాల వారీగా సర్వే జరగగా దాదాపు అన్ని విభాగాల్లోనూ మార్పులు చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు గుర్తించారు. జిల్లాలో 33 కేవీ విద్యుత్ లైన్లు 1319 కిలోమీటర్లు, 11 కేవీ లైన్లు 8019 కి.మీ, ఎల్‌టీ లైన్లు 14823 కి.మీ.వరకు ఉండగా, సుమారు 4.80 లక్షల విద్యుత్ స్తంభాలున్నాయి. మొత్తం 407లో 359 ఫీడర్లు సర్వే పూర్తి కాగా, ట్రాన్స్‌ఫార్మర్లు 24,627లో ప్రస్తుతానికి 7004 వరకు ట్రాన్స్‌ఫార్మర్లను మార్పు చేశారు. వీటిన్నింటినీ సర్వే చేయగా అందులో సగం వరకు పునరుద్ధరణ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే..భవిష్యత్‌లో మరిన్ని దశాబ్దాల పాటు విద్యుత్ సమస్యలు రావనే అభిప్రాయాన్ని విద్యుత్ ఇంజినీర్లు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లోనే విద్యుత్ పరికరాలు, సామగ్రి దాదాపుగా దెబ్బతింటున్న పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారు.

మూడు నెలల్లో పూర్తి..



విద్యుత్ ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న కీలకమైన నిర్ణయం ఇది. దశాబ్దాల కాలం క్రితం నుంచి ఉన్న విద్యుత్ వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉంది. ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లాలో పోల్ టు పోల్ సర్వే చేపట్టాం. లోపాలు, మరమ్మతు పనులపై నివేదికను సిద్ధం చేసుకున్నాం. ప్రస్తుతానికి బడ్జెట్ మేరకు పనులు చేపడుతున్నాం. మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో మరమ్మతులు, పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తాం.

– ఎల్.దైవప్రసాద్, విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ

మాటతప్పని నేత సీఎం జగన్



కొత్త లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- పింఛన్ల పంపిణీలో స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: ప్రజా సంకల్ప పాదయాత్రలో అవ్వాతాత కష్టాలను స్వయంగా చూసి చలించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ల పెంపు అమలు చేస్తూ మాటతప్పని నేతగా నిలుస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా మండలానికి కొత్తగా మంజూరైన 134 పింఛన్లను శుక్రవారం సరుబుజ్జిలిలో పంపిణీ చేశారు. ముందుగా లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో స్పీకర్ మాట్లాడుతూ ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛన్ సొమ్మును రూ.2750 పెంచారని చెప్పారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరుచేస్తుంటే టీడీపీ నేతలు మాత్రం రద్దు చేస్తున్నట్లు గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వారి పాలనలో పింఛన్ కావాలంటే ఎవరో ఒకరు చనిపోతే గానీ కొత్తది మంజూరయ్యేది కాదని గుర్తు చేశారు. కొండవలసలో టీడీపీ మాజీ సర్పంచ్ లోలుగు నీలంనాయుడుకు తాజాగా పింఛన్ మంజూరు చేయడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానాలకు నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ బెవర కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, బూత్ కమిటీ కన్వీనర్ మూడడ్ల రమణ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, పార్టీ నేతలు హరి, రవికాంత్, ప్రకాశరావు, ఎంపీడీఓ పి.వి.మురళీమోహన్‌కుమార్, తహసీల్దార్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులకు పీఎంఎస్‌బీ యోజన



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి వేతనదారులందరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను వర్తింపజేయనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు జి.వి.చిట్టిరాజు తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల వేతనదారులు అర్హులని చెప్పారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష పరిహారం అందుతుందని తెలిపారు. ఏడాదికి రూ.20 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వెలుగు ప్లాస్టర్ ఫెసిలిటేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో మెలిగి ఈ పథకంలో వేతనదారులను భాగస్వాములను చేయాలన్నారు.జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొన్ని మండలాల్లో పూర్తికాకపోవడం పట్ల పీడీ అసహనం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా 61 పని దినాలు ఉన్నందున పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. 2 లక్షల జాబ్ కార్డుదారులకు 100 రోజుల పనిదినాలు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. సగటు వేతనం రూ.250కి తగ్గితే సహించేది లేదన్నారు. జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ ప్రతి బుధవారం జరిగే ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో పీఎంఎస్‌బీ యోజన ప్రగతిని అడిగి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఏపీడీలు శైలజ, యుగంధర్, హరిత, ప్లాంటేషన్ మేనేజర్ శ్యామల, సూపర్‌వైజర్ జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నతండ్రిపై కొడుకు దాడి

టెక్కలి రూరల్: స్థానిక చేరీ వీధికి చెందిన గండి జోగారావు అనే వ్యక్తిపై శుక్రవారం రాత్రి ఆయన కుమారుడు గండి సత్యనారాయణ దాడికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి జోగారావు ఇంటిలో ఉండగా.. కుమారుడు సత్యనారాయణ బయట నుంచి వచ్చి పొలాన్ని తన పేర రాసివ్వాలని గొడవ పెట్టుకున్నాడు. ఇది చిన్న వాగ్వాదంగా మొదలై గొడవ వరకు వెళ్లింది. దీంతో తీవ్ర ఆవేశానికి లోనైన సత్యనారాయణ ఇంటిలో ఉన్న పదునైన వస్తువుతో జోగారావుపై దాడికి తెగబడ్డాడు. దీంతో జోగారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

లారీని ఢీకొన్న బస్సు

కోటబొమ్మాళి: మండలంలోని వాంగ్రాడ వద్ద జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గురువారం రాత్రి ఒడిశాకు చెందిన ప్రయివేటు బస్సు టెక్కలి వైపు నుంచి నరసన్నపేట వైపు వెళ్తుండగా వాంగ్రాడ వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రయాణికులు మిథిన గౌడ ఇచ్చిన ఫిర్యాదుమేరకు బస్‌డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు.

ఉత్కంఠగా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పురుషుల, శ్రీకాకుళం మహిళల పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రాంతీయ పాలిటెక్నిక్ క్రీడాపోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం జరిగిన పోటీల్లో 10 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల విభాగంలో 100 మీటర్ల రన్నింగ్‌లో వై.దివ్య (శివాని), ఎం.మౌనిక (వెంకటేశ్వర), ఎం.సౌజన్య (శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 200 మీటర్ల పరుగులో ఝాన్సీ (వెంకటేశ్వర), సౌజన్య (శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్), యోగిత (శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్), 400 మీటర్ల రన్నింగ్‌లో శిరీష (వెంకటేశ్వర), లావణ్య (వెంకటేశ్వర), పద్మా (నారాయణ), 800 మీటర్ల పరుగులో లావణ్య (వెంకటేశ్వర), శిరీష (వెంకటేశ్వర), శ్రావణి(ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇతర విభాగాల్లోనూ విద్యార్థులు రాణించారు.

మత్స్యకారుల వలసల నివారణే లక్ష్యం



బుడగుట్లపాలెం సముద్రతీరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, జేసీ నవీన్

- చంద్రబాబు చెప్పినట్లే పవన్ మాట్లాడతారు
- బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ స్థలం పరిశీలనలో మంత్రి సీదిరి అప్పలరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా నుంచి మత్స్యకారుల వలసలను శాశ్వతంగా నివారించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో రూ.365 కోట్లతో చేపట్టనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. తీరంతో పాటు ప్రభుత్వం సేకరించిన 42 ఎకరాల స్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడారు. జిల్లాలో కరోనా సమయంలో పది వేల మంది వలస కార్మికులు ఉండగా, అందులో ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన వారే ఎనిమిది వేల మంది ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బుడగుట్లపాలెంలో హార్బర్ నిర్మిస్తే వలసల నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. భావన పాడులో పోర్టు, మంచినీళ్లపేటలో జెట్టీల నిర్మాణం పూర్తయ్యాక హార్బర్‌గా మార్పు, బుడగుట్లపాలెం హార్బర్ అందుబాటులోకి వస్తే మత్స్యకారులకు పుష్కలంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఈ క్రమంలో రాష్ట్రంలో తొమ్మిది హార్బర్లు మంజూరు చేయగా, నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయని, మిగిలిన నిర్మాణాలు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. తీర ప్రాంతం ప్రగతి కోసం ప్రభుత్వం రూ.3600 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. బుడగుట్లపాలెం హార్బర్ నిర్మాణానికి స్థల పరిశీలన, భూసేకరణ, టెండర్లు పూర్తయ్యాయని, విశ్వ సముద్ర సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. రూ.120 కోట్లు పీఎంఎస్‌వై పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందజేయనుందని చెప్పారు. దేశంలో గుజరాత్‌లో 18, తమిళనాడులో 14, కర్నాటకలో 10 హార్బర్లు ఉండగా, ఏపీలో మాత్రం విశాఖపట్నం, కాకినాడల్లో మాత్రమే ఉన్నాయని, గత ప్రభుత్వాలు తీర ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశాయని దుయ్యబట్టారు. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ ప్యాకేజీ నాయకుడని విమర్శించారు. చంద్రబాబు ప్యాకేజీ ఇస్తే ఆయన మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రజారాజ్యంలో ఉన్నప్పుడు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దతుగా నిలిచినప్పుడు మత్స్యకారుల కోసం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పాకిస్థాన్‌లో మత్స్యకారులు చిక్కుకున్నప్పుడు వారిని విడిపించేందుకు, కరోనా వేళ ఇతర రాష్ట్రాల నుంచి వలస మత్స్యకారులను స్వగ్రామాలకు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. మత్స్యకారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎచ్చెర్ల జెడ్పీటీసీ, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షురాలు బల్లాడ హేమమాలినీ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మత్స్యశాఖ జేడీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి రాంబాబు, బల్లాడ జనార్దనరెడ్డి, మూగి శ్రీరాములు, బడివానిపేట సర్పంచ్ కారి తాతారావు, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, బోర సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని అడ్డుకున్న ఎమ్మెల్యే అశోక్



పనులను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అశోక్, టీడీపీ నేతలు

ఇచ్ఛాపురం రూరల్: అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. కొఠారీ గ్రామంలో రెండున్నర సెంట్ల ప్రభుత్వ స్థలంలో నాడు-నేడు పథకం ద్వారా రూ.16 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి మూడు నెలలు క్రితం ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ దుక్క ధనలక్ష్మీ భూమిపూజ చేశారు. ఆ స్థలంపై కన్నేసిన టీడీపీ కార్యకర్తలు అప్పట్లో అడ్డుకున్నప్పటికీ రెవిన్యూశాఖాధికారుల జోక్యంతో వెనక్కి తగ్గారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి సచివాలయ సిబ్బంది జేసీబీతో పునాదులు తీస్తున్న సమయంలో టీడీపీ నేతల సమాచారం మేరకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ పనులను అడ్డుకున్నారు. చిన్నారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున రోడ్డుకు దగ్గరగా భవన నిర్మాణం చేపట్టకూడదని హుకుం జారీ చేశారు. అయితే గ్రామస్తుల సూచనల మేరకే నిర్మాణం చేపడుతున్నట్లు సీడీపీఓ పి.నాగరాణి సమాధానం ఇచ్చారు. అయినా ఎమ్మెల్యే తగ్గకుండా ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్మాణం చేపట్టరాదన్నారు. సర్పంచ్‌ధనలక్ష్మీ, ఎంపీటీసీ ప్రతినిధి పిట్ట విశ్వనాథంతో పాటు కొంతమంది గ్రామస్తులు భవనం ఇక్కడే నిర్మించాలంటూ కోరగా, స్థానిక టీడీపీ కార్యకర్తలు, నేతలు ససేమిరా అంటూ కేకలు వేయడంతో ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు ఇరువర్గాలను వారించారు. అనంతరం అధికారులు వెనుదిరిగారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కార్యాలయం నిర్మించకపోగా, ఇప్పుడు అభివృద్ధిని అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని పలువురు విమర్శిస్తున్నారు.

పర్యాటక కేంద్రాలుగా బీచ్‌లు



వివరాలు సేకరిస్తున్న పర్యాటక శాఖ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు ఏపీ టూరిజం కన్సల్టెంట్ రాజ్‌కుమార్, జిల్లా సహాయ పర్యాటక అధికారి దున్న రమేష్ అన్నారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం, డి.మత్స్యలేశం పంచాయతీ కొత్త మత్స్యలేశం బీచ్‌లను శుక్రవారం పరిశీలించారు. పర్యాటకానికి అనుకూలంగా ఉండటంతో పాటు శ్రీకాకుళం నగరానికి దగ్గర్లోనే ఉండటంతో అభివృద్ధి పనులకు తీసుకోవాల్సిన చర్యలపై ఏపీ టూరిజం శాఖకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. బీచ్‌లను అనుసంధానం చేస్తూ అంతర్గత రోడ్లు వేస్తే పర్యాటకం మరింత ప్రగతి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పర్యాటక మండలి సభ్యులు పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభం



మొబైల్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: వ్యవసాయి రంగంలో మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో సెంచూరియన్ యూనివర్సిటీ యాజమాన్యం ఆధ్వర్యంలో అశోక్ లైలాండ్ సహకారంతో ఏర్పాటు చేసిన మొబైల్ నాలెడ్జ్ సెంటర్‌ను పలాస క్యాంప్ కార్యాలయం ప్రాంగణంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఫల్గునరావు, గ్రామ తరంగ్ పర్లాఖిమిడి సేల్స్ హెడ్ చలపతిరావు, యూనివర్సిటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236